క్లుప్తంగా

హకీంపేట్‌లో పైపులైన్ మరమ్మతులు


మిషన్ భగీరథ పైపులైన్‌కు మరమ్మతులు చేస్తున్న సిబ్బంది

సాక్షి ఎఫెక్ట్..

దుద్యాల్: మండల పరిధిలోని హకీంపేట్ గ్రామంలో మిషన్ భగీరథ పైపులైన్ పగిలిపోవడంతో రెండు రోజులుగా తాగునీటి సరఫరాకు అంతరాయం ఏర్పడింది. దీంతో ప్రజలు ప్రైవేట్ బోర్లను ఆశ్రయించి తాగునీటిని తెచ్చుకున్నారు. ఇదే విషయమై సాక్షిలో నిలిచిన భగీరథ అనే శీర్షికతో మంగళవారం కథనాన్ని ప్రచురించింది. దీనికి స్పందించిన అధికారులు పగిలిన పైపులైన్‌కు మరమ్మతు పనులు పూర్తి చేసి తాగునీరు సరఫరా చేశారు. ఈ సందర్భంగా గ్రామస్తులు ఆనందం వ్యక్తం చేశారు.

కుదురుమల్లలో మైసమ్మ బోనాలు


బోనాలతో వెళ్తున్న మహిళలు

దుద్యాల్: మండల పరిధిలోని కుదురుమల్లలో రాయపురం మైసమ్మ బోనాలు ఘనంగా నిర్వహించారు. గ్రామ శివారులోని మైసమ్మ తల్లికి గ్రామస్తులు బోనాలు సమర్పించారు. నెత్తిన బోనంతో, అమ్మవారి పాటలు పాడుతూ ప్రధాన వీధుల గుండా ర్యాలీగా వెళ్లి మైసమ్మ తల్లికి బోనాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు.

కొనసాగుతున్న రేణుకా ఎల్లమ్మ జాతర

తాండూరు రూరల్: మండల పరిధిలో కోత్లాపూర్ శివారులోని శ్రీ రేణుకా ఎల్లమ్మ జాతర కొనసాగుతుంది. మంగళవారం భక్తులు తరలివచ్చి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. తాండూరు ప్రాంతంతో పాటు కర్ణాటక నుంచి భక్తులు అధిక సంఖ్యలో హాజరయ్యారు. అనంతరం భక్తులు అమ్మవారికి బోనంతో ఆలయం చుట్టు ప్రదక్షిణలు చేశారు. ఆతర్వాత అమ్మవారికి నైవేద్యం సమర్పించారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ నవీన్ రెడ్డి, ఈవో శేఖర్‌గౌడ్, మాజీ సర్పంచు సాయిలు జాతర ఏర్పాట్లను పర్యవేక్షించారు.

పేదలకు అండగా బీజేపీ


ఆర్థిక సహాయం అందజేస్తున్న బీజేపీ నేతలు

దోమ: పేదలకు అండగా బీజేపీ ఉంటుందని బొంపల్లి నేతలు పేర్కొన్నారు. మంగళవారం దోమ మండల పరిధిలోని బొంపల్లిలో గ్రామానికి చెందిన సాలే సాయప్ప అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న బీజేపీ నేతలు మృత దేహానికి నివాళులర్పించి బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి అంత్యక్రియలకు రూ.5వేలు ఆర్థిక సహాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో నర్సింహాయాదవ్, మల్లేశ్‌యాదవ్, బోయిని నరేశ్‌ముదిరాజ్, వెన్నశెట్టి నర్సింహులు, మల్లేష్ యాదవ్, సాయి సంతోష్, లక్ష్మణ్‌నాయక్ పాల్గొన్నారు.

అకాల వర్షం.. రైతన్నకు నష్టం


కొనుగోలు కేంద్రంలో తడిసిన ధాన్యం

యాలాల: మండలంలోని పలు గ్రామాల్లో మంగళవారం సాయంత్రం వర్షం కురిసింది. వరి కొనుగోలు కేంద్రాల వద్ద ఎండబెట్టిన ధాన్యం తడిసి ముద్దయింది. రాస్నం గ్రామంలోని రైతు వేదిక సమీపంలో డీసీఎంఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కేంద్రం వద్ద తడిసిన ధాన్యాన్ని కాపాడుకునేందుకు రైతులు అవస్థలు పడ్డారు. అయినప్పటికీ కొంత ధాన్యం తడిసి నీటిపాలయ్యాయి. అంతేకాకుండా ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద సంచుల కొరత ఉండటంతో పాటు తేమ శాతం ఉన్నప్పటికీ కాంటా ప్రక్రియ ఆలస్యమవుతుందని పలువురు రైతులు వాపోతున్నారు. తడిసిన ధాన్యాన్ని కూడా తక్షణమే కొనుగోలు చేయాలని రైతులు మొర పెట్టుకుంటున్నారు.

ఇష్టారాజ్యంగా ధాన్యం కొనుగోళ్లు

- 15 రోజులైనా సెంటర్ వద్దే పడిగాపులు
- గోనూర్ కేంద్రం వద్ద సిబ్బంది అలసత్వం
- ఇబ్బందులు ఎదుర్కొంటున్న రైతులు
- పట్టించుకోని అధికారులు


గోనూర్ కొనుగోలు కేంద్రం వద్ద పేరుకుపోయిన ధాన్యం

తాండూరు రూరల్: భారత్ వ్యవసాయక దేశం. కాబట్టి రాష్ట్రంలో కూడా వ్యవసాయం ఎక్కువగా ఉంటుంది. పల్లెల్లో దీనిపై ఆధారపడి జీవించే వారి సంఖ్య ఎక్కువ. రైతే–రాజు అనడంలో సందేహం లేదు. అలాంటిది రైతుకు ఇబ్బందులొస్తే పట్టించుకునే వారు లేరు. వారు పండించిన ధాన్యానికి సరైన గిట్టుబాటు ధర రాక, మరోవైపు కొనుగోలు కేంద్రాల్లో అమ్ముడు పోక రోజుల తరబడి పడిగాపులు కాస్తున్నారు. ఈ విషయంలో అధికారుల తీరుతో ప్రభుత్వానికి చెడ్డపేరు వస్తోందని అన్నదాతలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. 15 రోజులు గడిచిన కొనుగోలు కేంద్రాల్లో కొనడం లేదని ఆవేదన చెందుతున్నారు. సాయంత్రమయితే చాలు ఉరుములు, మెరుపులతో కంటిమీద కునుకు ఉండడం లేదు. తాండూరు మండలం గోనూర్ శివారులోని డీసీఎంఎస్ కేంద్రం వద్ద రైతుల అవస్థలపై ప్రత్యేక కథనం... గోనూర్‌లో కొనుగోలు కేంద్రాన్ని 20 రోజుల క్రితం ఏర్పాటు చేశారు. ఈ కేంద్రం పరిధిలో గోనూర్, నారాయణపూర్, వీర్‌శెట్టిపల్లి రైతులు విక్రయిస్తున్నారు. అయితే ధాన్యం కొనుగోళ్లలో డీసీఎంఎస్ సిబ్బంది ఇష్టారాజ్యంగా వ్యవహరించడంతో అన్నదాతలు ఇబ్బందులు పడుతున్నారు. అకాల వర్షం వస్తే ధాన్యాన్ని కాపాడుకునేందుకు నానాతంటాలు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ధాన్యం ఆరబెట్టే సమయంలో సాయంత్రమయితే చాలు అకాల వర్ష భయం చుట్టుకుంటుంది. ఎప్పుడు వర్షం పడుతుందో, గాలి దుమారం ఎప్పుడు వీస్తుందోనని ఆందోళన ఎక్కువవుతుందని చెబుతున్నారు. ఒకవేళ వర్షం పడి ధాన్యం తడిస్తే కొనుగోలు చేయడం లేదు. దీంతో 15 రోజులుగా సెంటర్ వద్దే రాత్రి, పగలు తేడా లేకుండా పడిగాపులు కాస్తున్నామని అంటున్నారు. వర్షం పడటంతో ధాన్యం మొలకెత్తుతుందని రైతులు నారాయణరెడ్డి, రాఘవరెడ్డి, ప్రసాద్‌కుమార్, రవికాంత్‌రెడ్డి, వినోద్, రఘుపతిరెడ్డి, పరుశురాం, అంజిలమ్మ వివరిస్తున్నారు.

తడిసిన ధాన్యం కొనడం లేదు

తడిసిన ధాన్యాన్ని రైతుల నుంచి కొనుగోలు చేస్తామని చెబుతున్న క్షేత్రస్థాయిలో మాత్రం అధికారులు కొనుగోలు చేయడం లేదని రైతులు చెబుతున్నారు. అనుకోకుండా వర్షాలు పడుతున్నాయని, ఆరబెట్టిన తర్వాత సకాలంలో కొనుగోలు చేయకపోతే మళ్లీ వర్షానికి తడిస్తే పడేపాట్లు అంతా ఇంతా కాదు. మరోవైపు గన్ని బ్యాగుల కొరత ఉందని రైతులు చెబుతున్నారు. గోనూర్ డీసీఎంఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రం వద్ద గోనూర్, నారాయణపూర్, వీర్‌శెట్టిపల్లి రైతులనుంచి ఇప్పటి వరకు 19వేల బస్తాల ధాన్యం కొనుగోలు చేశారని అధికారులు చెబుతున్నారు. అంటే 7,600 క్వింటాళ్లు మాత్రమే కొనుగోలు చేశారు. ఇంక 10 రోజుల సమయం మాత్రమే సెంటర్ కొనసాగించే అవకాశం ఉంది. ఇంకా రైతుల నుంచి 10వేల బస్తాల వరిధాన్యం కొనాల్సి ఉంది.

తాలు పేరుతో దోపిడీ

కొనుగోలు కేంద్రం వద్ద సిబ్బంది రైతులను నిలువుదోపిడీ చేస్తున్నారని చెబుతున్నారు. కాంటా సమయంలో ఒక బస్తాకు తాలు పేరుతో కిలో నుంచి రెండు కిలోల వరకు ఎక్కువగా కాంటా వేస్తున్నారని రైతులు లబోదిబోమంటున్నారు. ఈ విషయాన్ని పట్టించుకునే వారు కరువయ్యారు.

పర్యవేక్షణ లోపం

సీఎం రేవంత్‌రెడ్డి సొంత జిల్లా వికారాబాద్‌లో ఉన్నతాధికారులు క్షేత్రస్థాయిలో పర్యటన చేయాలని వారం క్రితం రాష్ట్ర సీఎస్ రామకృష్ణ రావు జిల్లా అధికారులను ఆదేశించారు. కానీ అధికారులు మాత్రం గ్రామీణ ప్రాంతాల్లోని కొనుగోలు కేంద్రాలను ఇప్పటి వరకు తనిఖీ చేయడం లేదనే ఆరోపణాలు ఉన్నాయి. ఉన్నతాధికారుల పర్యవేక్షణ లోపం కారణంగా సెంటర్ల వద్ద సిబ్బంది ఇష్టరాజ్యంగా వ్యవహరిస్తున్నారని రైతులు వాపోతున్నారు. ఇప్పటికైన అధికారులు స్పందించి ధాన్యం కొనుగోళ్లలో వేగం పెంచాలని పలువురు కోరుతున్నారు.

30 వేల బస్తాలు ఇచ్చాం

గోనూర్ సెంటర్ పరిధిలోని రైతులకు 30 వేల బస్తాలు ఇచ్చాం. అందులో 2వేల బస్తాలు డ్యామేజ్ అయ్యాయి. మిగత బస్తాలు రైతులకు అందజేశాం. కొనుగోలు చేసిన వరి ధాన్యాన్ని మిల్లులకు హమాలీలతో లారీల్లో ఎక్కిస్తున్నాం. కావున కొనుగోళ్లు ఆలస్యం అవుతున్నాయి. తడిసిన ధాన్యాన్ని మిల్లర్లు కొనడం లేదు. కాబట్టి మేము రైతుల నుంచి కొనుగోలు చేయడం లేదు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు కాంటా వేయిస్తున్నాం.

– వెంకట్‌రాజు, కొనుగోలు కేంద్రం ఇన్‌చార్జి, గోనూర్


నిరసన వ్యక్తం చేస్తున్న రైతులు


తడిసిన ధాన్యం చూపిస్తున్న కొల్లి పరుశురాం, అంజిలమ్మ

అధికారులు చర్యలు తీసుకోవాలి


డిప్యూటీ తహసీల్దార్ శ్రీనివాస్‌కు వినతిపత్రం అందిస్తున్న సురేశ్

కొడంగల్ రూరల్: వరి కోతలు కోసి నెల రోజులు గడుస్తున్నా కొనుగోలు కేంద్రాల వద్ద రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని రైతు సంఘం జిల్లా కార్యదర్శి గంటి సురేష్ ఆవేదన వ్యక్తం చేశారు. మంగళవారం పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో రైతుల ఇబ్బందులు తొలగించాలని, అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతూ డిప్యూటీ తహసీల్దార్ శ్రీనివాస్‌కు వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మిల్లర్లు కాంటా వేసేటప్పుడు ఒక బస్తాకు మూడు నుంచి 5కిలోల వరిధాన్యం తీస్తున్నారని, రైతులు ప్రశ్నిస్తే తాలు పేరిట మోసం చేస్తున్నారన్నారు. ఈ విషయంలో అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో మొగిలి అనంతయ్య, బాబ్యానాయక్, బి.ప్రవీణ్, నర్సిములు తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన రెవెన్యూ సదస్సులు


ధారూరులో నిర్వహించిన రెవెన్యూ సదస్సులో అదనపు కలెక్టర్ లింగ్యానాయక్

ధారూరు: మండలాన్ని పైలెట్ ప్రాజెక్టుగా తీసుకుని ఈ నెల 5నుంచి నిర్వహించిన భూ భారతి రెవెన్యూ సదస్సులు మంగళవారం ముగిసాయి. రాంపూర్ తండా, ధారూరు, గట్టెపల్లి గ్రామాల్లో నిర్వహించిన సదస్సులకు జిల్లా అదనపు కలెక్టర్ లింగ్యానాయక్ హాజరయ్యారు. రైతులు ఇచ్చిన దరఖాస్తులను ఆయన పరిశీలించి తగిన సూచనలు, సలహాలు అందజేశారు. వ్యవసాయ భూముల్లో ఇళ్లు లేకున్నా ధరణి నేచర్ ఆఫ్ ల్యాండ్ కాలమ్‌లో హౌసెస్ అని పొరపాటున నమోదు చేశారని, చాలా కాలంగా మ్యుటేషన్లు ఆగిపోయాయని, పాసుపుస్తకాలు రాలేవని రైతులు జిల్లా అదనపు కలెక్టర్ దృష్టికి తీసుకొచ్చారు. ఈ విషయంలో తగిన చొరవ తీసుకుని తమ సమస్యను పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. మూడు గ్రామాల్లో మొత్తం 102 దరఖాస్తులు అందజేశారు. ఈ సదస్సుల్లో తహసీల్దార్లు సాజిదాబేగం, దీపక్‌సింసన్, శ్రీనివాస్, డీటీ విజయేందర్, ఆర్‌ఐ స్వప్న, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఆదర్శ మార్కెట్‌గా తీర్చిదిద్దుతాం

మార్కెట్ చైర్మన్ మహేందర్ రెడ్డి


మాట్లాడుతున్న మహేందర్ రెడ్డి

మర్పల్లి: వ్యవసాయ మార్కెట్‌ను జిల్లాలోనే ఆదర్శ మార్కెట్‌గా తీర్చిదిద్దుతామని వ్యవసాయ మార్కెట్ చైర్మన్ మహేందర్ రెడ్డి అన్నారు. మంగళవారం మర్పల్లి వ్యవసాయ మార్కెట్ కార్యాలయంలో పాలకమండలి సభ్యులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మార్కెట్ కార్యదర్శి వెంకటేశ్వర్‌రెడ్డి ఎజెండా అంశాలను చదివి వినిపించారు. ఈ సందర్భంగా మహేందర్ రెడ్డి మాట్లాడుతూ చైర్మన్‌గా విధులు చేపట్టిన అనతి కాలంలోనే గతంలో ఎన్నడూ లేనివిధంగా స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ చొరవతో అభివృద్ధి చేశామన్నారు. ఇప్పటికే మర్పల్లి వ్యవసాయ మార్కెట్‌లో రూ. 50 లక్షలతో పశువుల సంతలో సీసీ రోడ్డు, మార్కెట్ రోడ్డు నుంచి ఎస్టీ గిరిజన ఆశ్రమగురుకుల పాఠశాల వరకు సీసీ రోడ్లు వేయించామన్నారు. త్వరలో మర్పల్లి మార్కెట్ ఆవరణలో చిరు వ్యాపారుల కోసం కవర్‌షెడ్ నిర్మాణం చేపడుతామన్నారు. మార్కెట్ వైస్ చైర్మన్ మల్లేశ్ యాదవ్ మాట్లాడుతూ మార్కెట్ ఆవరణలోని పోల్స్‌కు బల్బులు బిగించి, సీసీ కెమెరాలను ఏర్పాటు చేసేవిధంగా చర్యలు తీసుకోవాలని చైర్మన్, కార్యదర్శి దృష్టికి తీసుకువచ్చారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది రఘు, పెంటయ్య, మగ్బూల్ మర్పల్లి, బంట్వారం, మోమిన్‌పేట్ మండలాల మార్కెట్ కమిటీ డైరెక్టర్లు పాల్గొన్నారు.

సమ్మెను జయప్రదం చేయాలి


నిరసన వ్యక్తం చేస్తున్న కార్మిక సంఘాల నాయకులు

కొడంగల్ రూరల్: జులై 9వ తేదీన నిర్వహించనున్న దేశవ్యాప్త కార్మిక సంఘాల సమ్మెను జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు బుస్స చంద్రయ్య కోరారు. మంగళవారం పట్టణంలోని అంబేడ్కర్ చౌరస్తాలో పలు శాఖల కార్మిక సంఘాల నాయకుల ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ కేంద్రప్రభుత్వం తెచ్చిన నాలుగు లేబర్ కోడ్లను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్మికులకు కనీస వేతనం ఇవ్వాలని, ఉద్యోగభద్రత కల్పించాలని, నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు కల్పించాలన్నారు. తమ డిమాండ్ల సాధనకు నిర్వహించతలపెట్టిన సమ్మెను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు పకీరప్ప, కార్యదర్శి రమేశ్, మహేశ్, వెంకటలక్ష్మి, విజయ్‌కుమార్, సుగుణమ్మ, సాయమ్మ, లక్ష్మి, మొగులమ్మజీపీ, వర్కర్లు రాజు, యాదయ్య, హరియానాయక్ తదితరులు పాల్గొన్నారు.

అప్రమత్తత అవసరం

- వ్యవసాయశాఖ ఇన్‌చార్జి ఏడీఏ కొమరయ్య
- పత్తి విత్తనాల కొనుగోలు సమయంలో జాగ్రత్తలు తీసుకోవాలి

తాండూరు రూరల్: వర్షాకాలం సమీపిస్తున్న తరుణంలో రైతులు పత్తి విత్తనాలు కొనుగోలు చేసే సమయంలో అప్రమత్తంగా ఉండాలని వ్యవసాయశాఖ తాండూరు ఇన్‌చార్జి ఏడీఏ కొమరయ్య మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గ్రామాల్లో విక్రయించి, బిల్లులు ఇవ్వని వ్యాపారుల వద్ద కొనుగోలు చేయొద్దని పేర్కొన్నారు. గ్రామాల్లో ఎవరైనా విక్రయిస్తే వెంటనే వ్యవసాయ శాఖ అధికారులకు సమాచారం చేరవెయ్యాలని సూచించారు. బీటీ–111 పత్తి విత్తనాలకు ప్రభుత్వం నుంచి అనుమతి లేదని హెచ్చరించారు. గడ్డి మందు తట్టుకునే రకం అంటు మోసం చేసే అవకాశం ఉందని తెలిపారు. పరిచయం లేని డీలర్ల వద్ద విత్తనాలు కొనుగోలు చేయొద్దని సూచించారు. లైసెన్స్ ఉన్న డీలర్ల వద్దే కొను గోలు చేసి రశీదు తీసుకోవాలని పేర్కొన్నారు.

నైపుణ్యాల మెరుగుకు శిక్షణ తరగతులు

– మండల విద్యాధికారి గోపాల్


పరిగి: ఉపాధ్యాయుల శిక్షణ తరగతుల్లో మాట్లాడుతున్న మండల విద్యాధికారి గోపాల్

పరిగి: ఉపాధ్యాయులు నైపుణ్యాలను మెరుగు పరుచుకునేందుకు శిక్షణ తరగతులు అవసరమని మండల విద్యాధికారి గోపాల్ పేర్కొన్నారు. మంగళవారం పట్టణ కేంద్రంలోని నంబర్‌వన్ ఉన్నత పాఠశాలలో ప్రభుత్వ ఉపాధ్యాయులకు శిక్షణ తరగతులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల ప్రగతికి, విద్యాసామర్థ్యాల సాధనకు ఉపాధ్యాయులకు శిక్షణ అవసరమన్నారు. ఈ కార్యక్రమంలో రిసోర్స్ పర్సన్స్ ఉస్మాన్ అలీ, వీణ, వెంకట్ ప్రసాద్, నరేందర్‌రెడ్డి, లక్ష్మయ్య, ప్రసాద్, స్వప్న, రమేష్ పాల్గొన్నారు.

ఉన్నతులుగా తీర్చిదిద్దాలి

బంట్వారం: విద్యార్థులను ఉన్నతులుగా తీర్చిదిద్దే బాధ్యత ఉపాధ్యాయులపై ఉందని ఎంఈఓ చంద్రప్ప పేర్కొన్నారు. కోట్‌పల్లి జెడ్పీహెచ్‌ఎస్ పాఠశాలలో ఫండమెంటల్ లిటరసీ అనే అంశంపై హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులకు నిర్వహించిన శిక్షణ తరగతుల్లో ఆయన మాట్లాడారు. ఎఫ్‌ఎల్ఎన్ బోధనా విధానాలను విద్యార్థులకు చక్కగా బోధించాలన్నారు. పాఠ్యపుస్తకాలు, కీలక సూత్రాలు, మౌఖిక సామర్థ్య సాధన, ధ్వని, అక్షర గుర్తింపు, తరగతిగది అనువాదం తదితర అంశాలపై ఆయన వివరించారు. ఈ కార్యక్రమంలో రిసోర్సు పర్సన్ దివాకర్ శాస్త్రి, సీఆర్‌పీ నర్సింలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అర్థమయ్యేలా బోధించాలి

దౌల్తాబాద్: విద్యార్థులకు అర్థమయ్యేలా బోధించాలని ఎంఈఓ వెంకట్‌స్వామి అన్నారు. మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులకు ఎఫ్ఎల్ఎన్ కెపాసిటీ బిల్డింగ్‌పై ఐదు రోజులు నిర్వహించనున్న శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలుగు, గణితం, ఇంగ్లీష్, పరిసరాల విజ్ఞానం సబ్జెక్టులపై శిక్షణ నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

గుణాత్మక విద్యను అందిద్దాం

బొంరాస్‌పేట: రానున్న విద్యా సంవత్సరంలో అన్ని ప్రాథమిక పాఠశాలల్లో గుణాత్మక విద్యను అందిద్దామని మండల విద్యాధికారి హరిలాల్ అన్నారు. మండల కేంద్రంలోని జెడ్పీహెచ్‌ఎస్‌లో మండల స్థాయి ఎఫ్ఎల్ఎం ఉపాధ్యాయుల శిక్షణా కార్యక్రమంలో మాట్లాడారు. ఈ నెల 24వరకు నిర్వహించనున్న కెపాసిటీ బిల్డింగ్ అంశాలపై మండలంలోని ఎస్‌జీటీ, ఎల్ఎఫ్ఎల్ ఉపాధ్యాయులకు శిక్షణా తరగతులు ప్రారంభించారు.

నాణ్యమైన విద్య లక్ష్యం

దోమ: ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించేందుకు ఉపాధ్యాయులు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఎంపీడీఓ గ్యామా అన్నారు. మండల కేంద్రంలో ఎంఈఓ వెంకట్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులకు ఏర్పాటు చేసిన శిక్షణ తరగతుల్లో ఆయన మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలలో పేద విద్యార్థులు విద్యను అభ్యాసిస్తుంటారని, ఉపాధ్యాయులు ప్రత్యేక చొరవ తీసుకొని బోధించాలన్నారు. విద్యార్థులు మంచి ఉత్తీర్ణత సాధించేలా ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. అనంతరం ఎంఈఓ వెంకట్ మాట్లాడుతూ..కస్తూర్బా గాంధీ పాఠశాలలో ఈ నెల 24వ తేదీ వరకు ఉపాధ్యాయులకు వివిధ అంశాలపై శిక్షణ ఉంటుందని తెలిపారు.

కుల్కచర్ల: విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధికి ఉపాధ్యాయులు ప్రత్యేకంగా కృషిచేయాలని కుల్కచర్ల ఎంఈఓ అబీబ్ అహ్మద్, చౌడాపూర్ ఎంఈఓ రాంచందర్ పేర్కొన్నారు. కుల్కచర్ల, చౌడాపూర్ మండల కేంద్రాల్లో ఎస్జీటీ ఉపాధ్యాయులకు శిక్షణ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఆయా క్లస్టర్ల సీఆర్పీలు రఘు, విజయ్, మైపాల్, గాంగ్య తదితరులు పాల్గొన్నారు.


బంట్వారం: శిక్షణ తరగతుల్లో మాట్లాడుతున్న ఎంఈఓ చంద్రప్ప


దోమ: మాట్లాడుతున్న ఎంపీడీఓ గ్యామా

సంక్షిప్త వార్తలు

◆ ఫార్మర్ రిజిస్ట్రేషన్ తప్పనిసరి

బంట్వారం: రైతులందరు ఫార్మర్ రిజిస్ట్రేషన్ తప్పనిసరిగా చేయించుకోవాలని ఎఈఓ సందీప్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఫార్మర్ రిజిస్ట్రేషన్ చేయించుకోకుంటే పీఎం కిసాన్, సబ్సిడీ ఎరువులు, పంట దిగుబడి, కొనుగోళ్లు, మద్దతు ధర, పంట రుణాలు నిలిపివేస్తారన్నారు. దీనికోసం రైతులందరు తప్పనిసరిగా రిజిస్ట్రేషన్ చేయించుకోవాలన్నారు. రిజిస్ట్రేషన్ కోసం ఆధార్‌కార్డు, ఆధార్ లింకున్న ఫోన్ నంబర్ వెంట తీసుకురావాలన్నారు.

◆ సమస్యల పరిష్కారానికి కృషి

కుల్కచర్ల: పాత్రికేయుల సమస్యల పరిష్కారానికి టీయూడబ్ల్యూజే, ఐజేయూ నిరంతరం కృషి చేస్తుందని పరిగి తాలుకా అధ్యక్షుడు శివకుమార్ అన్నారు. మంగళవారం చౌడాపూర్ మండల కేంద్రంలో కుల్కచర్ల మండల కమిటీకి అనుబంధంగా మండల కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..పాత్రికేయుల సమస్యల పరిష్కారానికి ఎమ్మెల్యే కృషి చేయాలన్నారు. టీయూడబ్ల్యూజే, ఐజేయూ మండల కమిటీ అధ్యక్షులుగా పాండు, ప్రధాన కార్యదర్శిగా కల్యాణ్‌కుమార్, ఉపాధ్యక్షులుగా విజయ్‌కుమార్, కోశాధికారిగా నర్సింలు, కార్యదర్శిగా కుమార్, సహాయ కార్యదర్శిగా రాజేష్, కార్యవర్గసభ్యులుగా చంద్రశేఖర్, విశ్వేంద్రచారి, శీనయ్యలను ఎంపిక చేశారు. ఈ కార్యక్రమంలో సంఘ నాయకులు చంద్రశేఖర్, రమేష్, విజయ్, వినోద్ తదితరులు పాల్గొన్నారు.

◆ విద్యా హక్కు చట్టాన్ని అమలుచేయాలి

కొడంగల్ రూరల్: రాష్ట్రంలో ప్రభుత్వ అనుమతి పొందిన ప్రైవేటు స్కూల్స్ విద్యా హక్కు చట్టాన్ని అమలు చేసేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు రాజ్‌కుమార్‌గౌడ్ డిమాండ్ చేశారు. మంగళవారం పట్టణంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ ప్రైవేటు స్కూళ్లలో 25శాతం ఉచిత విద్య అందించేందుకు నిరాకరిస్తున్న నిర్ణయాన్ని ట్రస్మా ఉపసంహరించుకోవాలని, పేద, మధ్య తరగతి విద్యార్థులకు 25శాతం ఉచిత విద్యను ప్రైవేటు స్కూళ్లు అందించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు.

◆ నేడు పంటల సాగుపై అవగాహన

మర్పల్లి: పట్లూర్ రైతు వేదికలో పంటలపై బుధవారం వ్యవసాయ శాస్త్రవేత్తలు అవగాహన కల్పిస్తారని మర్పల్లి ఏఓ శ్రీకాంత్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ముఖ్యంగా బావులు, బోర్లు కలిగిన రైతులు ఉద్యాన శాఖ ద్వారా ఆయిల్ పామ్, పంట సాగు చేసుకొనేందుకు ముందుకు వచ్చే రైతులకు ప్రభుత్వం కల్పిస్తున్న రాయితీ, పంట సాగులో తీసుకోవలసిన మెళుకువలు, సూచనలు, సలహాలు శాస్త్రవేత్తలు ఇస్తారని పేర్కొన్నారు. ఉదయం 11 గంటలకు పట్లూర్ రైతు వేదికలో హాజరు కావాలని పేర్కొన్నారు.

◆ తాగునీటి సమస్య పరిష్కరించాలి

మర్పల్లి: ఇంద్రకాలనీలో నెలకొన్న తాగునీటి సమస్యను పరిష్కరించాలని మర్పల్లి మదర్ థెరిసా స్వచ్ఛంద సంస్థ చైర్మన్ రవివర్మ అధికారులకు విజ్ఞప్తి చేశారు. మంగళవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ తమ కాలనీలో పక్షం రోజుల నుంచి మిషన్ భగీరథ నీరు రావడం లేదన్నారు. కాలనీలకు సరఫరా చేసే బోరుమోటారు పాడైందని ఇంతవరకు మరమ్మతులు చేయించలేదని అధికారుల దృష్టికి తెచ్చారు. ఈ విషయాన్ని పంచాయతీ కార్యదర్శి దృష్టికి తీసుకుపోగా గ్రామ పంచాయతీ ట్యాంకర్‌తో రెండు రోజులకు ఒక్కసారి సరఫరా చేస్తున్నామన్నారు. తమ కాలనీలో బోరు మోటారు కాలిపోయిందని మిషన్‌భగీరథ, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారుల దృష్టికి తీసుకుపోయినా పట్టించుకోవడం లేదని రవివర్మ పేర్కొన్నారు. ఉన్నతాధికారులు స్పందించి తమ కాలనీలో నెలకొన్న తాగునీటి సమస్యను పరిష్కరించాలన్నారు. పాడైన బోరు మోటారును వెంటనే మరమ్మతులు చేయించాలని కోరారు.

రైతుల నుంచి విరివిగా దరఖాస్తులు

ధారూరు: మండలంలోని 34 రెవెన్యూ గ్రామాల్లో నిర్వహించిన భూభారతి రెవన్యూ సదస్సుల్లో రైతుల నుంచి విరివిగా దరఖాస్తులు అందాయని తహసీల్దార్ సాజిదాబేగం మంగళవారం తెలిపారు. బాచారం గ్రామంలో 16, నర్సాపూర్, అవుసుపల్లిలో 12, కాచారంలో 10, ధర్మాపూర్, ఎబ్బనూర్, గురుదోట్ల, అల్లాపూర్‌ల్లో 17, అల్లిపూర్‌లో 7, నాగారం, గడ్డమీది గంగారంలో 24, చింతకుంట, కొండాపూర్‌కలాన్‌లో 11, హరిదాస్‌పల్లిలో 15, కుమ్మర్‌పల్లి, రుద్రారం, దోర్నాల్‌లో 9 చొప్పున, నాగ్‌సాన్‌పల్లి, మున్నూరుసోమారంలో 3, కేరెల్లిలో 4, కుక్కింద, అంపల్లిలో 14, మోమిన్‌కలాన్‌లో 22, అంతారంలో 6, మోమిన్‌ఖుర్దులో 31, రాజాపూర్‌లో 25, తరిగోపులలో 63, మైలారంలో 8, నాగసమందర్‌లో 36, బూర్గుగడ్డలో 2, ధారూరులో 46, రాంపూర్‌తండాలో 42 మంది రైతులు సమస్యలపై దరఖాస్తులు చేసుకున్నారని ఆమె వివరించారు.